

# నన్నిలా బ్రతకనీ

కిల్లాన మోహన్‌బాబు

రేడియో స్టేషన్‌లో త్వరగ పని ముగించుకుని సిరిపురం జంక్షన్ కొచ్చేసరికి సరిగ్గా ఐదుంపావయింది. అప్పటికే అక్కడ జనం బాగాఉన్నారు. అంటే చాలాసేపటినుంచి బస్ రాలేదన్నమాట! 'ఇంకా ఎంతసేపు నిల్చోవాలో' అని విసుక్కుంటూ అటూ ఇటూ చూస్తూ యిబ్బందిగా నిల్చున్నాను నేను. ఇంతలో నా ముందో కారాగింది.

"రాధా" అని పిలిచారెవరో!

దగ్గరికెళ్ళి చూస్తే డ్రైవింగ్ సీట్లో కృష్ణ! ఆశ్చర్యపోయాను ఆమె నక్కడలా చూసి! సరిగ్గా ఏడేళ్ళయింది ఆమెను కలసి. బాగా మారిపోయింది. అప్పటి ఆమె రూపురేఖల్తో యిప్పటి కృష్ణను పోల్చి చూస్తే 'హస్తిమశ కాంతరం' ఉంటుంది!

నా నోట మాటలు రాక అచేతనంగా నిల్చున్నాను!

"ఏమిటలా చూస్తున్నావ్ ... కారెక్కు" అని ఫ్రంటు డోరు తెరిచింది.

అప్పటికే మా యిద్దరివేపూ చుట్టుపక్కల వాళ్ళు వింతగా చూస్తున్నారు.

నేను మవునంగా కారెక్కాను.

"ఇప్పుడు... ఇక్కడ... ఇలా..." మాటలు తడబడుతున్నాయి నాకు.

"ఓ నెల క్రితమే నాకిక్కడి హాస్పిటల్‌కి ట్రాన్స్‌ఫరయింది. 'అప్ లాండ్స్ వాల్టేర్'లో మా ఫ్రెండ్ ఒకామె ఉంటే చూసివస్తున్నాను. ఇంతలో నువ్వు కన్పించావ్. నువ్వు బెజవాడ రేడియో స్టేషన్‌లో పనిచేసేవాడివి కదా..." అంది డ్రైవ్ చేస్తూనే.

"అవును. నేనిక్కడికి మారి ఓ సంవత్సరమయింది." అన్నాను ఆమెవైపు చూస్తూనే.

ఇంకేం మాట్లాడలేదు కృష్ణ. నే నామెవేపు చూస్తూ యిబ్బందిగా కూర్చున్నాను. గాలికి ఆమె ముంగురులు ముచ్చటగా అటూ యిటూ కదులుతున్నాయ్. ఆమె ముఖం ఏదో వెలితిగా కన్పించింది నాకు. పరీక్షగా చూశాను. ఆమె నుదుటిమీద బొట్టు లేదు!

"డాక్టరయినంత మాత్రాన బొట్టు పెట్టుకోవడం లాంటివి కూడా మూఢనమ్మకాల కిందకి వస్తాయా?" వ్యంగ్యంగా అన్నాను నేను.

చివాల్న చూసింది నావేపు!

"నీ కిప్పుడేం పనిలేకపోతే అలా బీచ్ వేపొస్తావా?" అడిగింది.

పదమన్నట్లు తలూపాను.

మెయిన్ రోడ్ జంక్షన్‌దగ్గర 'టర్న్' చేసి బీచ్‌వైపు తిప్పింది కారుని. మరో ఐదు నిముషాల్లో రామకృష్ణ బీచ్ కొచ్చాం. కారు పార్క్‌చేసి ఇసుకలో కూర్చున్నాం.

"ఇందాక నా గురించి ఎగతాళిగా మాట్లాడావ్. నేను ముందు హిందూ స్త్రీని. తరువాతే డాక్టర్ని! నేను బొట్టు పెట్టుకోకపోవడానికి కారణం ... ... ఆ అర్హతని ఈమధ్యనే పోగొట్టుకోవడం ..."

"కృష్ణ ..." గట్టిగా అరిచాను నేను.

"ఇది నిజమేనా? నీకెంత అన్యాయం జరిగింది? ఐయామ్ రియల్లీ సారీ... వెరీ సారీ... నిన్ను అనవసరంగా బాధపెట్టాను నిజం తెలియక. నన్ను క్షమించవూ? ప్లీజ్." నా కళ్లలో నీళ్ళు నా మాటల కడ్డొచ్చాయి!

"ఆయనో పెద్ద ఆర్థోపిడీషియన్! హైదరాబాద్‌లోని 'బంజారా హిల్స్'లో ఓ కేసు చూసి వస్తుంటే యాక్సిడెంటయి ... వెంటనే పోయారు! అందుకే నేనా ఊళ్లో ఉండలేక బాబుని తీసుకుని యిక్కడి కొచ్చేశాను, ట్రాన్స్‌ఫర్ చేయించుకుని. బాబు యిప్పుడు కోరుకొండ సైనిక్ స్కూల్లో చదువుతున్నాడు..." ఆమె గొంతు బరువెక్కడంతో మరి మాట్లాడలేకపోయింది దుఃఖంతో.

"నీకు భగవంతుడు చాలా అన్యాయం చేశాడు కృష్ణా! నన్ను పెళ్లి చేసుకోలేదని నీమీద నాకెంతో కోపం ఉండేది. కానీ... నీదికూడా నాలాగే ఒంటరి బ్రతుకయిపోయిందన్నమాట..." ఏం మాట్లాడాలో, ఆమెనెలా ఊరడించాలో అర్థం కావడంలేదు నాకు. అలాగే మవునంగా మరో పావుగంట కూర్చున్నాం.

"ఎక్కడుంటున్నావ్?" అడిగాను.

"డాబా గార్డెన్స్‌లో" కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది కృష్ణ.

"నేను పూర్ణా మార్కెట్ దగ్గరుంటున్నాను" ఆమె అడగకపోయినా చెప్పాను.

"మరి పెళ్లి చేసుకోవా?" నావేపు చూస్తూ అడిగింది.

"ఆ ఉద్దేశం నాకున్నప్పుడు నువ్వు కాదన్నావ్! ఆ దెబ్బతో నేను పెళ్లి అనే ఉద్దేశాన్నే కాదన్నాను."

"రాధా! మనం అనుకున్నవన్నీ జీవితంలో అయిపోవు! కాలేజీ రోజుల్లో నేనూ నిన్ను ప్రేమించాను. కాని నాన్నగారి నిర్ణయానికి కట్టుబడవలసి వచ్చింది కొన్ని కారణాలవల్ల. పరిస్థితులతో రాజీపడడమే జీవితం! లేనిపోని ఆలోచనలు మాని చక్కగా పెళ్లిచేసుకో ..."

నవ్వాను నేను అదోలా. టైం చూశాను. ఏడున్నరయింది.

"ఇహ లేద్దామా" అంటూ లేచాను.

ఇద్దరం 'క్వాలిటీ'లో కాఫీ తాగి కారెక్కాం... ఆరోజు రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు. కృష్ణతో నేను గడిపినరోజులు పదేపదే గుర్తుకొచ్చి నన్ను కలవరపెట్టాయి!

"రాధా... రాధా" అంటూ ఎంత ఆప్యాయంగా పిలిచేది నన్ను!

"నువ్వు అబ్బాయివైనా నీ పేరులో 'రాధ' నేను అమ్మాయినైనా నా పేరులో 'కృష్ణ' భలేగా ఉన్నాయి కదూ..." అంటూ నా కళ్లలోకి చూస్తూ గలగలా నవ్వేసేది!

"మనిద్దరం క్రిందటి జన్మలో రాధాకృష్ణులమని తెలిసే నీ పేరు 'కృష్ణవేణి'గా, నా పేరు 'రాధాకృష్ణ'గా పెట్టారు మన పెద్దవాళ్ళు" అనేవాణ్ణి నేను!

కాని పెళ్ళి మాట వచ్చేసరికి మా యిద్దరి మధ్యా 'అంతస్థు' అడ్డొచ్చింది! ఒక్క కూతురు కావడంవల్ల తండ్రి నెదిరించలేకపోయింది కృష్ణ. అతను కోరినట్లుగా గుంటూరు వెళ్లి 'మెడిసిన్'లో జాయినయింది. నేను మాత్రం నాకున్న నాటకానుభవంతో బెజవాడలో రేడియో స్టేషన్‌లో స్థిరపడ్డాను. అంతే! ఆ తరువాత కాలచక్రం ఇరుసులో మేమిద్దరం యిలా నలిగిపోతున్నామన్న మాట...

ఆ మర్నాడు సాయంత్రం స్టూడియో కొచ్చింది కృష్ణ బస్‌లోనే. మేమిద్దరం బీచ్‌కెళ్ళాం. ఎంతోసేపు కూర్చున్నాం ... ఎన్నో మాట్లాడుకున్నాం. ఆ తరువాత ఎన్నో సాయంత్రాలు అలా గడిచిపోయాయి!

మునుపటిలా మేమిద్దరం సరదాగా మాట్లాడుకోవడం ప్రారంభించాం. ఎండిపోయిన నా ఎదలో మళ్లీ ఏదో అలజడి! బండబారిన నా ఒంటరి బ్రతుకులో ఏదో కొత్త సవ్వడి! నా సాహచర్యంలో ఆమె నిండుగా నవ్వగలుగుతోంది! నా కదే పదివేలు!

కాని ... ఆ నవ్వు కలకాలం ఆమె పెదవుల

# ఆంధ్రసచిత్రవారపత్రిక

## రచయితలకు గమనికలు

★ ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కథలూ యితర రచనలు పంప దలచుకున్నవారు సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ—520 003 అన్న చిరునామాకి వ్రాయాలి.

★ కవరుమీద శీర్షిక పేరు పేర్కొనడం మంచిది. రచయితలు తమ పూర్తి పేరూ చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి— హామీ పత్రం జత చెయ్యాలి.

★ గేయాలు తిప్పి పంపబడవు. వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు నుంచి ఎనిమిది వారాల గడువు అవసరం.

★ కథలుగాని, యితర రచనలుగాని తిప్పి పంపబడాలని కోరుకునేవారు— వారి స్వంత చిరునామా గల తగినన్ని తపాలా బిళ్ళ అంటించిన కవరు పెట్టడం అవసరం.

★ రచనల గురించి పంపిన వెంటనే గాక ఎనిమిది వారాల తరువాత మాత్రమే వాటిపై నిర్ణయం కోసం ఎదురుచూడడం మంచిది. రచనల గురించి ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు కాని— తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయవలసివస్తే రచయితలు— రచన పేరు— అది పంపిన తేదీ, వివరంగా వ్రాయండే. వాటి గురించి పరిశీలించడం కష్టం.

★ మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి. వారికి కూడా స్వంత చిరునామా గల తగినన్ని తపాలా బిళ్ళ అంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది.

★ కార్టూన్‌లు పంపేవారు కూడా 8 వారాలలోగా మా మీద ఉత్తరాల దాడి చెయ్యకూడదు... ప్రతి కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి

★ ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్‌ల కవర్సుపై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది.

★ కార్టూన్‌ల ఎంపిక తరువాత వాటి ప్రచురణ వీలు వెంబడి జరుగుతుంది.

★ రచయితలకు కార్టూనిస్టులకు ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహాల శీర్షికలో 'వద్దు' వారికి తప్ప తతిమ్మా అందరికి; అవి వద్ద "ప్రతు"లను— కాల క్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము. కాపీలు టపాలో పోయే ప్రమాదం వుంటుంది తప్ప పంపకపోవడం జరుగదు. సం.

## నన్నిలా బ్రతకనీ !

మీద ఎందుకు ఉండకూడదు ? ఈ పరిచయం 'శాశ్వత బంధం' ఎందుకు కాకూడదు ? వాడిపోయిన ఆమె జీవితాన్ని ఎందుకు ఉద్ధరించకూడదు ?

ఒరిపోతున్న ఆ దీపానికి 'ఆసరా'గా నిలిచి 'ఆలంబన'గా ఎందుకాదుకోకూడదు ?

ఇలాంటి ఆలోచనలతో ఎన్నో రాత్రులు గడిపిన పిమ్మట ఆమెను పెళ్ళి చేసుకోవాలన్న నిర్ణయాని కొచ్చాను.

ఓ రోజు సాయంత్రం బీచ్‌లో...

"కృష్ణా! నీతో ఓ విషయంగూర్చి చాలా సీరియస్‌గా మాట్లాడాలి. నీవు 'వెలుగు నీడలు' సినిమా చూశావు కదూ ?" అడిగాను డైరెక్ట్‌గా అడగడం ఎందుకని.

"చూశాను ఏం ?" అంది కనుబొమలు ముడిచి.

"అందులో 'కలకానిది... విలువైనది' పాట బావుంటుంది కదూ ? 'గాలివీచి పూలతీగ నేలవాలిపోగా... జాలివీడి అటులే దాని వదలివేతువా? చేరదీసి నీరు పోసి చిగురింపనీయవా ?' అన్న చరణంమీద నీ అభిప్రాయం ?" సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాను.

"రాధా... నీ మనసులో అభిప్రాయం నా కర్థమయింది. ఈ మాటలు నువ్వు నన్ను ఉద్దేశించి అన్నావేనని చెప్పకనే చెపుతున్నాయి ! నామీద జాలితో నన్నుద్ధరించడానికి కంకణం కట్టుకుని 'వితంతు వివాహం' చేసుకున్నా... నీవు సుఖపడవని నాకు తెలుసు. ఒకప్పుడు నీవంటే ప్రేమ కాబట్టే నీతో ఇలా మాట్లాడుతున్నాను. నా బాధలు మరచిపోగలుగుతున్నాను. పెళ్ళయిన తరువాత ఆడది ఎంతో ఎదిగిపోతుంది రాధా. నీకు కాలేజీరోజుల్లో తెలిసిన కృష్ణకీ ... ఇప్పటి కృష్ణకీ ఎంతో తేడా ఉంది. గడ్డు పరిస్థితుల నెదుర్కొనే 'మనోబలం' పెళ్ళితో ఆడదానికి వచ్చేస్తుంది తెలుసా ?

అదీకాక, నీవేదో ఆవేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నావ్. అదికాస్త తగ్గాక, పెళ్ళయి కోరికల వేడి చల్లారాక నేనో 'సెకండ్ హాండ్' వస్తువులా కనిపిస్తాను. ఇపుడున్న ప్రేమస్థానంలో 'ద్వేషం' రావచ్చు. అపుడు మనిద్దరి బ్రతుకులూ నరకమవుతాయి !

ఇహ బాబు ఎలా ఫీలవుతాడో ఊహించావా ? మా మూడేళ్ళ దాంపత్యానికో తీపి గుర్తు మా బాబు. వాడి భవిష్యత్తు తీర్చిదిద్దవలసిన బాధ్యత నామీద లేదంటావా ?

వృత్తిరీత్యా డాక్టర్ని కాబట్టే గతస్మృతులతో శేషజీవితాన్ని గడుపుతూ... సమాజానికి సేవచేస్తూ గడిపేస్తాను... అంతేకాని నా స్వార్థం నేను చూసుకుని చనిపోయిన ఆయనకూ, బ్రతికున్న మా బాబుకీ అన్యాయం చేయలేను. అంచేత దయచేసి అలాంటి ఉద్దేశాన్ని నీ మనసులోకి రానీకు. ప్లీజ్... నన్నిలా బ్రతకనీ..." ఆవేశంగా ఊగిపోతూ అంది కృష్ణ !